# సూపర్ కిడ్

నాకీ మధ్య మా ఇంట్లో జరుగుతున్న విషయాలు నాలో విస్మయాన్ని, కాసింత భయాన్ని, కొంత ఆందోళననీ కల్గిస్తున్నాయి. మా బాబుకి నాలుగేళ్లు నిండాయి.

అయితే వాడిలో 'ఏదో చూడాలని' నా శ్రీమతి పడుతున్న తాపత్రయం నా ఆందోళనకి ముఖ్యకారణం. ముచ్చటగా బుల్లి బుల్లి కబుర్లు చెబుతూ నా దగ్గర చలాకీగా వుండే మాచింటూ తల్లిని చూడగానే బెంబేలెత్తుతున్నాడు.

దానికి కారణం శ్రీదేవి వాడిని ఏదోరంగంలో సూపర్‌కిడ్‌గా చూడాలనే ఆశతో... ఏదేదో నేర్పించటం, వాడికేదీ రాకపోయేసరికి నాలుగ్గంటించటం, దాంతో వాడిమొహంలో ఏదో దిగులు, బుగులు.

ఆరోజు ఆదివారం కాబట్టి ఏదో రాసుకుంటూ కూచున్నాను. నాన్నా అంటూ పరిగెత్తుకువచ్చాడు. శ్రీదేవి వుంటే భయంతో 'డాడీ' అనే పిలుస్తాడు. 'ఏంటీ కన్నా' అన్నాను. వాడిని ఈమధ్యే శాతవాహన స్కూల్లో ఎల్.కె.జీలో చేర్చాం.

''నాకసలుపాడతంరావట్లేదు'' అన్నాడు దీనంగా.

''ఏంటి? పాటలు పాడటమా? అయినా నీకిప్పుడు పాడే అవసరం ఏమిట్రా?'' అన్నాను దగ్గరకి తీస్కుంటూ.

''అదికాదు... ఈటీవీలో పాడుతా తీయగాలో పిల్లలు ఎంతబాగా పాడుతున్నారో చూడు. నువ్వు దేంట్లో లేవు అని మమ్మీ తిట్టింది''

నాకేం మాట్లాడాలో అర్థంకాలేదు.

"అయినా... స్కూల్లో లంచ్ పీరియడ్‌లో పాడతానికి ట్రై చేశాను. మా ఫ్రెండ్స్ అంతా నవ్వారు."

"అవునా..." అన్నాను ఏదో ఆలోచిస్తూ.

"అవున్నాన్నా... నాకు చాలా ఇన్సల్టింగ్ అన్పించింది" వాడి మొహంలో అవమానం పొందిన బాధ స్పష్టంగా కనిపించసాగింది.

"కిరణ్‌గాడైతే డంకీసాంగ్‌లా ఉందన్నాడు"

"కిషోర్‌గాడు మంకీపాప్‌లా ఉందన్నాడు"

వాడి కంఠం కోపంతో కుతకుతలాడుతోంది.

అనునయంగా దగ్గరకి తీస్కుంటూ "ఏం పాట పాడావ్‌రా" అనడిగాను.

"చంకరా... నాద చరీర పరా..."

నాకు నవ్వొచ్చింది. అయినా ఆపుకుంటూ "నీకు బాగానే పాడొచ్చు. కాకపోతే ఇంకాస్త పెద్దయ్యాక ఇంకా బాగా పాడొస్తుంది. సరేనా" అన్నాను.

వాడి కళ్లల్లో మెరుపులు.

ఇంతలో 'చింటూ...' అని శ్రీదేవి పిలవటంతో పరిగెత్తుకెళ్లాడు. వెనకే నేనూ వెళ్లాను. ఏదో ఛానెల్‌లోవస్తోన్న దృశ్యాన్ని ఒడిలో కూచోపెట్టుకుని చూపిస్తోంది.

టీ.వీ.లో నాలుగేళ్ల కుర్రాడు కాబోలు ధైర్యంగా మారుతీకారు నడుపుతున్నాడు.

"భలే...భలే..." చప్పట్లు చరిచాడు చింటూ.

"చూడూ. నీలాగే ఉన్నాడు. నీ అంత వయసే. ఎంత బాగా నడుపుతున్నాడో చూడు" శ్రీదేవి వాడిలో క్యూరియాసిటీని పెంచుతోంది.

"మమ్మీ...మమ్మీ... మరి ఆ అన్నయ్యకి భయమేయట్లేదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

శ్రీదేవి వాడివైపు కోపంగా చూసి "పిరికి వెధవ. నీకైతే అన్నీ భయాలే. ఆ అబ్బాయి ఎంత డేరింగ్‌గా నడుపుతున్నాడో చూడు" అని విసుక్కుంది.

వాడి చిన్నారిమనసు చిన్నబోయింది.

దిగాలుగా నాకేసి చూశాడు.

"శ్రీ... వాడికి ఇంట్రస్టులేని వాటిని చూపిస్తూ వాణ్ణెందుకలా హింసిస్తావ్" అన్నాను కొంచెం సీరియస్‌గానే.

"హింసించడమా? అదేంటండీ... ఈకాలం పిల్లలు ఎంత ఫాస్ట్‌గా ఉంటున్నారో వాడికి చూపిస్తున్నాను. లేకపోతే వీడు ఎంత వెనకబడిపోతాడు?" అంది.

"అది కాదోయ్. టాలెంట్ అనేది ఒకరు నేర్పితే బయటకు రాదు. ఏదో, ఒకరోజు

అకస్మాత్తుగా బయటపడుతుంది. అది సాధన చేయడానికి ప్రోత్సహించాలి తప్ప... చూసి నేర్చుకున్నంత మాత్రాన కొన్ని కళలు అబ్బవు" అన్నాను.

"అది కాదండీ... ఈరోజుల్లో ఒక్క చదువు మాత్రమే ఉంటే లాభం ఉండొచ్చుకాని... దాంతోపాటు గుర్తింపు ఉండాలంటే అడిషనల్‌గా ఏదో రంగంలో ప్రవేశం ఉండాలన్నది నా అభిప్రాయం. అందుకోసం నేనేదో ప్రయత్నిస్తే దాన్ని మీరు హింసించడమంటున్నారు" అంటూ కోపంగా వంట గదిలోకి వెళ్లింది.

ఇంతలో ఫోన్ రావటంతో ఆ విషయం మర్చిపోయాను.

రమణ చేశాడు.

"ఇంట్లో ఏం చేస్తున్నావ్? సండే కదా... వచ్చేయ్. సరదాగా కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అనటంతో వాళ్లింటికి బయల్దేరాను.

నేను వెళ్లగానే ఎప్పుడూ పరిగెత్తుకొచ్చేవాళ్ల బేబీ జాహ్నవి ఎదురురాలేదు. రమణని పిలిచి వరండాలో కుచున్నాను. వాళ్లావిడ మిర్చీలు, కారప్పూస తెచ్చి పెట్టింది. రమణ మంచినీళ్లు పట్టుకొచ్చి పెట్టగానే 'జాహ్నవి లేదా' అనడిగాను.

"అయ్యో మీకు తెలీదు కదూ... జాహ్నవి కుడిచెయ్యి విరిగిందన్నయ్యా" అంది రమణ భార్య.

"ఎలా జరిగింది?" అన్నాను కంగారుగా.

"చెప్పినా వినకుండా ఈయనే కరాటే క్లాసులకి పంపిస్తున్నారు" అని చెప్పి లోపలికి వెళ్లింది.

"అంత చిన్నపిల్లని కరాటేకి ఎందుకు పంపుతున్నావ్ రమణా" అన్నాను కొంచెం సీరియస్‌గా.

"బేబీ ప్రత్యూషలాగా కరాటేలో జాహ్నవిని కూడా సూపర్‌కిడ్ చేయాలనివుంది" ఆమాట నాగుండెలమీద కొరడాదెబ్బలా బలంగా తాకింది.

ఏదో అనబోతున్న వాడినల్లా 'హల్లో...' అంటూ మోహన్ రావటంతో విష్ చేశాను.

మేం ముగ్గురం మంచి ఫ్రెండ్స్‌మి.

"ఇంత ఆలస్యమైందేమిటి?" అన్నాడు రమణ.

"మా వాడ్ని కంప్యూటర్‌తో కుస్తీ పట్టించి వస్తున్నాను. అందుకే లేటు" మోహన్ చెప్పాడు.

మోహన్ కొడుక్కి మూడేళ్లు.

"అప్పుడే నీ కొడుకుని బిల్‌గేట్స్ చేయాలనా...?" రమణ చిన్నగా నవ్వాడు. నాకైతే ఓ భయంకరమైన వాతావరణంలో చిక్కుకున్నట్లుంది.

ఏమిటీ వీళ్లంతా...?

బాల్యాన్ని తమ ఇష్టప్రకారం ఎంత దారుణంగా తుంచేస్తున్నారు? కాసేపటికి ఈ టాపిక్ మామధ్య సీరియస్ అయికూచుంది.

"మన పిల్లల్లో ఏ టాలెంట్వుందో తెల్సుకోకుండా... మనకిష్టమైంది నేర్చుకొని అందులో రాణించాలని కోరుకోవటం చాలా తప్పు. దీనివల్ల వాళ్లు దేనికీ కొరగాకుండా పోతారు" అన్నాను సీరియస్గా.

"మనకాలంలో అవకాశాలు లేక మన తల్లిదండ్రులు మనలో చదువుతప్ప ఇంకేదీ గుర్తించక పట్టించుకోలేదు. అది మన బ్యాడ్లక్. కానీ మన పిల్లలకి మనం ఏదైనా రంగంలో ఎదిగేలా చేయకపోతే మనం మంచి తల్లిదండ్రులం ఎలా అవుతాం?" అన్నాడు మోహన్.

"టాలెంట్ అనేది ఒకరు నేర్పితేరాదు. దాస్తే దాగదు. రఘురామయ్యగారు తరగతి గదిలో తరచూ ఈలలు వేస్తుంటే మాస్టార్లు కొట్టేవారట. తర్వాత ఆయన ఈలపాట రఘురామయ్యగా అంతర్జాతీయ కీర్తి సంపాదించాడు. ఏదో చెయ్యాలి అన్నది పక్కన బెడితే... మనం చెయ్యాల్సింది మంచిగుణాలున్న పౌరులుగా తీర్చిదిద్దితే చాలు" అన్నాను కొంచెం రోషంగా.

"టాలెంట్కీ... గుణంకీ సంబంధం లేదా?" సీరియస్గా అడిగాడు రమణ. "ఖచ్చితంగా లేదు. గొప్ప టాలెంట్వున్న వ్యక్తిగుణం కూడా గొప్పగా వుండాలన్న గ్యారంటీలేదు. ప్రపంచంలో చిన్నవయసులోనే డాక్టరైన వ్యక్తి వరకట్నం కేసులో అరెస్ట్ కాలేదా?"

"నేచర్ని బట్టే మనిషి తన టాలెంట్ని డెవలప్చేసుకుంటాడని నేనంటాను. ఇందిరాగాంధీ తన నేచర్ కనుగుణంగానే రాజకీయాల్లో ఎదిగింది. అదే ఆమెలోని టాలెంట్ కాదంటావా?" అన్నాడు మోహన్.

"టాలెంట్ అనేది సార్వజనీనం. నేచర్ వ్యక్తిగతం. ఈరెండూ ఒకే వ్యక్తిలో రైలుపట్టాల్లా వున్నప్పటికీ.... వేర్వేరు అని నా అభిప్రాయం. ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్రాలు అతనిలోని టాలెంట్కు నిదర్శనం. అన్నింటిలోనూ అతడు మాధురీదీక్షిత్ని ఊహించుకోవటం అతడి గుణానికి సంబంధించిన విషయం" అన్నాను.

"టాలెంట్, గుణం పూర్తిగా వేర్వేరయితే... మరి శోభరాజ్లో కన్పించేది దొంగ గుణం. అందులో అతడి టాలెంట్ ఏంటో చూపిన ప్రతిసారీ పోలీసులు నివ్వెరపోయారు. ఓసారి జైల్లోంచి ఒక పుస్తకాన్ని అతడు బయటకి పంపాడు. పోలీసులు దాన్ని సోదాచేసి ఏమీలేదని వదిలేశారు. కాని పుస్తకంలో ఓచోట రెండు పేజీల అంచుల్ని అతికించి మధ్యలో ఒక లెటర్ని పెట్టి పంపించాడట. మరిక్కడ అతడిగుణమూ, టాలెంట్ ముడిపడి వున్నాయా

లేదా?" అన్నాడు రమణ.

"అతడి గుణం అలాంటిది. దాంతో ఎంచుకున్న వృత్తిలో అతడి టాలెంట్ చూపించుకున్నాడు అంటే గుణానికి, టాలెంట్‌కి సంబంధం వుంది" కొంచెం గట్టిగానే అన్నాడు మోహన్.

మా మధ్య రెండు నిమిషాలు మౌనం...

"ఎంతగొప్ప టాలెంట్ వున్నా... మనిషి గుణం ప్రత్యేకంగానే వుంటుంది. మంచి ఫాలోయింగ్‌లో వున్నప్పుడు క్రికెట్‌లో అజహరుద్దీన్ టాలెంట్‌కి మురిసిపోయి దుబాయ్‌వనిత పెళ్లి చేసుకుంది. కాని సంగీతా బిజిలాని వెంటపడతున్న అతడిలోని గుణం నచ్చకే ఆమె విడాకులు తీసుకుంది. మరిక్కడ జరిగిందేమిటి? ప్రపంచవ్యాప్తంగా వున్న టాలెంట్‌కి మురిసివచ్చినామె... అతడికి ఎందుకు విడాకులిచ్చింది? మరో ఆడదాని వెంటపడే గుణం ఏ భార్యకీ నచ్చదు గనక..." అన్నాను.

"అంటే ఎక్కడో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన... టాలెంట్ వున్నవాళ్లందరికీ మంచి గుణం వుండదనా?" మోహన్ అడిగాడు.

"తన టాలెంట్‌మీద గౌరవం పెంచుకున్నవాళ్లు, తమ టాలెంట్‌ని పదిలంగా కాపాడుకోవాలనుకునేవాళ్లు మంచి గుణాలను అలవర్చుకుంటారు. వృత్తిపరంగానే కాక ప్రవృతిపరంగా కూడా హుందాగా వుంటారు. అయినప్పటికీ అదివేరు, ఇది వేరని నేను చెప్పేది. మనిషిలోని టాలెంట్ పదిమందిలో వున్నప్పుడు బయటపడుతుంది. మనిషి యొక్క గుణం ఒంటరిగా వున్నప్పుడు బయటపడుతుంది" అన్నాన్నేను.

ఇంతలో ఎవరో పక్కింటి పిల్లాడు శక్తిమాన్ సీరియల్ చూసి డాబా మీంచి దూకాడని రమణ భార్య రొప్పుతూ చెప్పటంతో అటువైపు పరిగెత్తాం. అప్పటికే అబ్బాయిని హాస్పిటల్‌కి తీసికెళ్లారట.

నాకెందుకో మనసంతా అల్లకల్లోలమైంది.

రమణ, మోహన్ మళ్లీ వాళ్లింటికి వెళ్లి కూచుందామన్నా మనసొప్పలేదు. అప్పటికే రెండుగంటలు గడిచాయి. వాళ్లదగ్గరా సెలవు తీసుకొని బయటపడ్డాను.

ఇంటికొచ్చేసరికి చింటూ నిద్రపోతున్నాడు.

ఎందుకో నాకే తెలీదు. మంచంపై కూచొని వాణ్ణి అలాగే చూస్తుండిపోయాను.

"దిష్టి తగుల్తుంది" శ్రీదేవి మాటతో బయటపడ్డాను.

"ఏమిటి సంగతి? వాణ్ణి అంత తీక్షణంగా చూస్తున్నారేంటీ? వాడు డాక్టరవుతాడా? పైలెట్ అవుతాడా? అని ఆలోచిస్తున్నారా?"

"వాడు మంచిమనిషైతే చాలు అని ఆలోచిస్తున్నాను" అనేసి డ్రెస్ విప్పి లుంగీ

కట్టుకున్నాను.

"అంటే? మీలాగన్నమాట..." మీకు ఏ టాలెంటూ లేదని శ్రీదేవి దెప్పిపొడిచినట్టు తోచింది.

మౌనంగా మంచంమీద వాలిపోయాను.

కాసేపటికి... చింటూ నిద్రలో కాళ్లూ చేతులూ ఆడిస్తూ... వెక్కిళ్లు పడ్డట్టుగా, ఉలిక్కిపడుతూ ఏవో అరుస్తున్నాడు.

ఆ దృశ్యం చూసి శ్రీదేవి భయపడింది.

నాక్కూడా కాళ్లూ చేతులు ఆడలేదు.

వాడు నిద్రలో ఏదో కలవరిస్తున్నాడు.

గాబరాగా 'చింటూ...చింటూ' అంటూ వాణ్ణి నిద్రలేపాము. వాడి లేతముఖం మీద చిన్నగా చెమటపట్టింది. నిద్రలోంచి లేస్తూనే భయంగా చూశాడు.

"ఏంటి కన్నా... కలొచ్చిందా?" అన్నాను.

శ్రీదేవి అక్కున చేర్చుకుంటూ "ఏమైందిరా... ఏం కలొచ్చింది. అలా చేశావేంట్రా?" అంటూ హత్తుకుంది.

మరో పదినిమిషాల వరకూ వాడిలో బెరుకుపోలేదు. స్థిమితపడ్డాక 'ఏమైందిరా?' అని మళ్లీ అడిగాం.

"స్కూల్లో స్విమ్మింగ్ పోటీలు పెట్టారు డాడీ. రాజేష్ ఫస్టొచ్చాడు. నాకూ నేర్చుకోవాలని వుంది కాని మనోహర్‌గాడేమో... నువ్వు దేంట్లోనూ లేవేమిట్రా? స్విమ్మింగైనా నేర్చుకో అంటూ నాకు భయమేస్తుందన్నా వినకుండా ఒక్కసారిగా నీళ్లలోకి తోసేశాడు. ఎన్ని నీళ్లుమింగానో... కాని ఇదికలా డాడీ... నిజంగానే నీళ్లలో మునిగిపోయాను అన్పించింది" అమాయకంగా చెప్పాడు.

ఇద్దరం మొహాలు చూసుకున్నాం.

వాడు చదువుకన్నా ఇలాంటి విషయాలపట్లే ఆందోళన పడుతున్నాడని నాకనిపించింది. దీనివల్ల చదువు దెబ్బ తినొచ్చుకాని... ఈ పరిస్థితుల్ని ఎవరు కల్పిస్తున్నారు?

"స్విమ్మింగ్ చాలా ఈజీ చింటూ... వీలున్నప్పుడల్లా నేను నేర్పిస్తాను సరేనా?" అన్నాను లాలనగా.

"ఓకే డాడీ..." తలూపి తల్లి ఒడిలో నిద్రపోయాడు.

* * * *

వృత్తిరీత్యా నేను జర్నలిస్టుని కాబట్టి మరో రోజు ఉదయమే నాకు మరో ఇన్సిడెంట్ ఎదురైంది. ఓవ్యక్తి ప్రొద్దున్నే మా ఇంటికొచ్చి పరిచయం చేసుకున్నాడు. అతడు ఆర్ అండ్

టి ఆఫీసులో సూపర్నెంట్‌గా పనిచేస్తున్నాడట. వాళ్ల మూడేళ్ల అబ్బాయి మొత్తం దేశాల రాజధానులు, అధ్యక్షుల పేర్లు చెబుతాడని... సూపర్‌కిడ్‌గా వాళ్ల అబ్బాయి గురించి ఓ వార్త రాయమని.

సరేనని అతణ్ణి పంపించి... మధ్యాహ్నం కెమెరా తీసికొని వాళ్లింటికెళ్లాను.

నారాక కోసమే ఎదురు చూస్తున్నారేమో భార్యాభర్తలిద్దరూ గుమ్మంలోనే ఎదురొచ్చి లోపలికి తీసికెళ్లారు. వాళ్లబాబుని పరిచయం చేశారు. ముద్దుగా బొద్దుగా వున్నాడు. నేను రెండు, మూడు స్నాప్స్ తీసి ''మన ఇండియా రాజధాని ఏది?'' అని అడిగాను.

''ఢిల్లీ'' ఠక్కున చెప్పాడు.

''జపాన్ రాజధాని?''

''తోక్యో''

''మలేషియా రాజధాని?''

ఆ అబ్బాయికి జవాబు తట్టలేదు. జవాబుకోసం చాలా ఆతృతపడుతున్నట్టు కన్పించాడు. వయసుకిమించిన జవాబుకోసం చిన్నారి మెదడ్ని చించుకుంటున్నట్టుగా అబ్బాయి ముఖకవళికలు మారుతున్నాయి. తల్లిదండ్రుల మొహాల్లో ఆదుర్దా, అయిదు నిమిషాలయ్యాక ''గు...ర్తు...రావట్లేదు'' అన్నాడు బాధగా.

''పోనీలే... అమెరికా అధ్యక్షుడి పేరు?''

''బిల్ క్లింతన్'' ''ఇరాక్ ప్రెసిడెంట్ పేరు?''

చెప్పలేకపోయాడు. అవగాహనతో అర్థంచేసుకున్న జవాబులైతే ఎవరికైనా మెదడు పొరల్లో నిక్షిప్తం అవుతాయి కాని... చిన్నారుల జ్ఞాపకశక్తికి మించి బట్టీ పట్టించటం అనర్థమే అని ఎంతమంది గ్రహిస్తున్నారు?

''మీ అబ్బాయికి మంచి భవిష్యత్తు వుంది'' అని చెప్పి అక్కడినుండి బయటపడ్డాను.

ఇంటికొచ్చేసరికి శ్రీదేవి ఆనందంగా టీ.వీ. చూస్తూ కన్పించింది. నన్ను చూడగానే... ''ఏమండీ... మన చింటూ క్రికెట్ ఆడుతున్నాడు. వాళ్ల స్కూల్ కాంపిటీషన్స్‌ని... అదిగో సిటీకేబుల్‌లో చూపిస్తున్నారు'' అంది.

నేను విస్మయంగా టీ.వీ. చూశాను.

చింటూ బ్యాటింగ్ చేస్తున్నాడు. అంతా చిన్నపిల్లలే. చింటూ కొట్టిన దెబ్బకి బంతి గ్రౌండ్ దాటింది.

''ఏమండీ... వాడిప్పటికే మూడు ఫోర్లు, అయిదు సిక్సర్లు కొట్టాడు'' అంది. వెంటనే ''అయ్యయ్యో... నేనిన్నాళ్లూ గమనించలేదు. వాడు క్రికెట్ ప్లేయర్ అవుతాడన్నమాట'' అంది మళ్లీ.

ఈలోపు చింటూ అవుటయ్యాడు.

మొత్తానికి ఆటలో వాణ్ని ''బోయ్ ఆఫ్‌ది మ్యాచ్'' గా ప్రకటించారు' వాడు కప్పు అందుకుంటూంటే శ్రీదేవి ఇంట్లోనే చప్పట్లు చరిచింది. నాకు నవ్వొచ్చింది.

అరగంట తర్వాత వాడు ఇంటికిరాగానే శ్రీదేవి దిష్టితీసింది. అప్పుడే మాఫ్రెండ్ ప్రకాష్ వచ్చాడు. చింటూ తెచ్చిన కప్పు చూసి ''వెరీగుడ్... నీకు క్రికెట్ అంటే చాలా ఇష్టమా'' అన్నాడు క్యాజువల్‌గా.

''కాదు...కానే కాదు... నాకు క్రికెటంటే అసహ్యం''

చింటూ మాటకి ముగ్గురం త్రుళ్లిపడ్డాం.

''అదేంటి... ఇష్టం లేనిదే అన్ని ఫోర్లు, సిక్సర్లు ఎలా కొట్టావ్?'' అన్నాడు ప్రకాష్.

''కోపంతో కొట్టానంతే...''

''కోపమా...? ఎవరి మీదా...?''

''మమ్మీమీద...'

వాడి మాట నెత్తిన పిడుగుపడ్డట్టుగా తగిలింది.

''మమ్మీమీద కోపం... బంతుల మీద చూపించానంతే. నాకు క్రికెట్ అంటే ఇష్టం వుండదు''

''మరి నువ్వేం కావాలనుకుంటున్నావ్'' ప్రకాష్ క్యూరియాసిటీగా అడిగాడు.

''నేను గుడ్‌బాయ్‌ని కావాలనుకుంటున్నాను''

వాడి జవాబు ప్రకాష్‌లో గాని, శ్రీదేవిలోగాని ఏ ఉత్సాహాన్నీ కలిగించలేదు. నాలో మాత్రం కొండంత సంతోషాన్ని నింపింది. చింటూ వీపు తట్టాను.

ప్రపంచంలో మంచితనాన్నిమించిన టాలెంట్ మరేదీ కాదని నాలో నేనే గొణుక్కున్నాను.

చింటూ నాదృష్టిలో... ఇప్పుడు సూపర్‌కిడ్!!